క్లుప్తంగా

జగనన్న కాలనీలో రోడ్డు



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, నాయకులు

వెలుగోడు: పట్టణంలోని జగనన్న కాలనీలో నిర్మించిన గ్రావెల్ రోడ్డును శుక్రవారం సర్పంచ్ వేల్పుల జయపాల్ ప్రారంభించారు. కాలనీకి వెళ్లే రహదారి సక్రమంగా లేకపోవడంతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన ఆదేశాలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు ఇలియాస్‌ఖాన్, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, రఘుస్వామిరెడ్డి, తెలుగు రమణ, టి.బాషా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వైస్ ఎంపీపీ



జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ

కొత్తపల్లి: ఈనెల 15న నిర్వహించిన వేలంపాటలో సంగమేశ్వరం వద్ద ఉన్న పర్యాటక శాఖ రెస్టారెంట్‌ను దక్కించుకున్న సందర్భంగా వైస్ ఎంపీపీ వెంకటరమణ శుక్రవారం నంద్యాల జిల్ల కేంద్రంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌ను పూల బొకే అందజేశారు. అనంతరం రెస్టారెంట్ అడ్వాన్స్ రూ.2,57,240ను డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో కలెక్టర్, ఆలయ చైర్మన్, జిల్లాపర్యాటక మండలి నంద్యాల వారికి అందజేశారు. సంగమేశ్వరం పర్యాటకులకు మరిన్ని వసతులు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

రాజద్రోహం కేసులు ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహులు

నందికొట్కూరు: మహిళా హక్కుల కోసం పోరాడే సంధ్యపై పెట్టిన రాజద్రోహం కేసులను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ సంధ్య, ప్రొఫెసర్ హరగోపాల్, పద్మజలపై మోపిన అక్రమ కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు. నాలుగు దశాబ్దాలకు పైగా మహిళల హక్కుల కోసం పోరాడటంతో నాటి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ ముందుండి పోరాటం చేశారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు అరుణ్, గోపాల్, ప్రేమరాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపుపై కేసు నమోదు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో కేసీ కెనాల్ మట్టిని అక్రమంగా తరలించడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జూటూరు గ్రామ పరిధిలోని కేసీ కెనాల్ పక్కన ఎల్లమ్మ వాగులో రామకృష్ణారెడ్డి జేసీబీ, ట్రాక్టర్లతో మట్టి తరలించాడన్నారు. ప్రభుత్వ ఆస్తిని డ్యామేజ్ చేశాడని కేసీ కెనాల్ ఏఈ శ్రీనివాసనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముస్లింలకు పెద్ద పీట

- ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షకూర్



హజ్ యాత్రికులకు సబ్సిడీ పత్రాలు విడుదల చేస్తున్న అబ్దుల్ షకూర్

నందికొట్కూరు: ప్రభుత్వం ముస్లింలకు పెద్ద పీట వేస్తోందని ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షకూర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని హాజీనగర్‌కు చెందిన బిలాల్ మసీదులో హజ్ యాత్ర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి సీఎం వైఎస్ జగనమోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు ఆర్థిక సాయం, నెలకు ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజంలకు రూ.5 వేల గౌరవ వేతనాలు ఇస్తుండటం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహబూబ్‌బాషా, డాక్టర్ రఫీ, ఇబ్రహీంఖాన్, మహమ్మద్‌బేగ్, అలిబేగ్, చాంద్, మహబూబ్‌బాషా, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లనాటి కల నెరవేరిన వేళ!

- పేదలకు గృహయోగం
- ఊరూరా కాలనీలు ఏర్పాటు
- పండుగలా గృహప్రవేశాలు



గాజులపల్లె లేఅవుట్‌లో చురుగ్గా సాగుతున్న గృహనిర్మాణాలు

మహానంది: గత ప్రభుత్వాల హయాంలో ఇల్లు మంజూరు కావాలంటూ నేతల ఇంటి చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి ఉండేది. కానీ జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరి సొంతింటి కల నెరవేరుతోంది. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేసి ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో గృహ నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. కొందరు ఇప్పటికే గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోగా మరికొందరి ఇళ్లు వివిధ దశల్లో రూపుదిద్దుకుంటున్నాయి.

సెంటు స్థలం కొనలేని పేదలు..

పట్టణ ప్రాంతాలే కాదు, గ్రామీణ ప్రాంతాల్లోనూ స్థలాల ధరలకు రెక్కలొచ్చాయి. సెంటు స్థలం కొనాలంటే ఏ చిన్న ఊర్లోనైనా సరే లక్షల్లో ధరలు ఉన్నాయి. ఈ క్రమంలో పేదల కష్టాలు తెలుసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విలువైన స్థలాలను ఎంపిక చేసి పేదలకు ఇళ్లపట్టాలు అందజేస్తూనే గృహాలు సైతం మంజూరు చేయడంతో పేదలు ఇల్లు నిర్మించుకునే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. శ్రీశైలం నియోజకవర్గంలోని శ్రీశైలం, ఆత్మకూరు, ఆత్మకూరు అర్బన్, సున్నిపెంట, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో 9,246 గృహాలు మంజూరయ్యాయి. దీంతో ఆయా మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరుతున్నాయి. ప్రతిపక్షాలు సమాధులకు పనికిరావని దుర్మార్గమైన వ్యాఖ్యలు చేసినా ప్రభుత్వం ఇచ్చిన సెంటున్నర స్థలంలో పేదలు అందమైన ఇళ్లను నిర్మించుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మంజూరైన ఇళ్లు..

ఆత్మకూరులో 1,480, ఆత్మకూరు అర్బన్‌లో 3,212, బండిఆత్మకూరు మండలంలో 1576, మహానంది మండలంలో 1545, వెలుగోడు మండలంలో 1,841 గృహాలు మంజూరయ్యాయి. వీటిలో సుమారు ఇప్పటికే 50 శాతం ఇల్లు పూర్తి కాగా మిగిలిన ఇళ్లన్నీ బీఎల్, బీబీఎల్, ఆర్‌సీ దశల్లో ఉన్నాయి. మొదటి దశలో ఎంపికైన గ్రామాల్లో అర్హులందరికీ ఇళ్లు మంజూరయ్యాయని ఆయా మండలాల హౌసింగ్ అధికారులు తెలిపారు. ఇప్పటికీ ఎవరైనా అర్హులై ఉండి ఇల్లు లేని పేదలకు తప్పకుండా రెండోదశలో మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఇంజినీరింగ్ అసిస్టెంట్లు దరఖాస్తులు స్వీకరిస్తూ కొత్తవారికి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. పేర్లు నమోదు చేసుకున్న వారు వెంటనే గృహనిర్మాణాలు మొదలుపెట్టాలని వారే లబ్ధిదారుల వెంట పడుతూ మరీ ఇల్లు నిర్మించే ప్రక్రియను ప్రారంభిస్తున్నారు.

ఎక్కడా గుడిసె కనిపించకూడదు



అర్హులైన ప్రతి పేదవారికి గృహాలను మంజూరు చేయిస్తున్నాం. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లినప్పుడు ఇల్లు కావాలని, ఇంటిస్థలం లేదని అడిగినవారందరికీ మంజూరు చేసేలా అధికారులను ఆదేశించాను. శ్రీశైలం నియోజకవర్గంలో ఎక్కడా గుడిసెలు కనపడకుండా ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టించి ఇవ్వడమే లక్ష్యం. వివిధ గ్రామాల్లో స్థలాలను పరిశీలిస్తున్నాం. ఇల్లు, ఇంటిస్థలాలు లేనివారికి త్వరలోనే మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నా. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

– శిల్పా చక్రపాణిరెడ్డి, ఎమ్మెల్యే, శ్రీశైలం

సొంత ఇంటి కల నెరవేరింది



ఇన్నాళ్లు అద్దె ఇంట్లో ఉంటూ అద్దెలు చెల్లించడం భారమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాల పథకంలో ఇంటిస్థలంతో పాటు ఇల్లు మంజూరైంది. ఇల్లునిర్మాణం సైతం పూర్తి చేసి గృహప్రవేశం చేసుకున్నాం. ప్రస్తుతం మాకు స్వంత ఇల్లు ఉండటం, అద్దె బాధలు తప్పడంతో ఆనందంగా ఉన్నాం.

– షేక్ బషీర్, గాజులపల్లె

ఇల్లు మేమే నిర్మించుకున్నాం



ఇల్లు లేని మాకు సీఎం జగన్ ఇల్లు మంజూరు చేశారు. మేము మొదటి నుంచి గౌండా పని చేయడంతో మా ఇల్లు మేమే నిర్మించుకున్నాము. ప్రభుత్వం మాకు సమయానికి సిమెంట్, కడ్డీలు, ఇసుక అందించింది. మూడు నెలల్లోనే ఇంటిని పూర్తి చేసుకున్నాము. గూడులేని నిరుపేదలకు, అద్దెలు చెల్లించలేక అల్లాడిపోతున్న మాకు నవరత్నాలు పథకం వెలుగు నింపింది.అధికారులు సైతం మాకు ఎంతో సహకరించారు. ప్రస్తుతం మా ఇల్లు పూర్తవడం సంతోషంగా ఉంది.

– షేక్ హుసేన్‌సా, ఫరీదా, బండిఆత్మకూరు

అర్హులందరికీ ఇల్లు మంజూరు చేస్తాం



అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తున్నాం. మొదటి విడతలో ఆరు గ్రామాలు ఎంపికయ్యాయి. మిగిలిన గ్రామాలు రెండో విడతలో ఎంపికవడంతో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఇప్పటికే ఇల్లు మంజూరైన లబ్ధిదారులు పనులు త్వరగా మొదలుపెట్టుకుంటే దశల వారిగా బిల్లులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– సుంకిరెడ్డి, ఏఈ, బండిఆత్మకూరు





పూజల్లో పాల్గొన్న భక్తులు, పూజలందుకుంటున్న స్వామివారు

భక్తిశ్రద్ధలతో మండల పూజ

వెలుగోడు: పట్టణంలోని లక్ష్మీప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రతిష్టాపన మహోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పూజా కార్యక్రమం ప్రారంభమైంది. నూతన ఆలయాన్ని ప్రతిష్టించి 41 రోజు పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు పురోహితులు మండల పూజా కార్యక్రమం ప్రారంభించారు. ఉత్సవ మూర్తులకు బ్రహ్మ కల్యాభిషేకము, హోమము, పూర్ణాహుతి, స్వామి వారికి అభిషేకం, కలశాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ బల్లాని వెంకటసత్యనారాయణ దంపతులు, బీవీ బాలయ్య, ఎం రమణయ్య లక్ష్మీనారాయణ, తెలుగు వెంకటేశ్వర్లు, తెలుగు రాజు, తెలుగు శంకర్, సాలమ్మ, నాగలక్ష్మి, లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.



పారుమంచాలలో విద్యాకానుక కిట్లతో విద్యార్థులు, సర్పంచ్ ప్రకాశం, హెచ్ఎం మురళి



విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విద్యాకానుక పంపిణీ

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల, భాస్కరావురం ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం అయా గ్రామాల సర్పంచులు ప్రకాశం, మాధవి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు మురళి, జాకీర్‌హుసేన్, పీఎంసీ చైర్మన్ చిన్నముత్తు పాల్గొన్నారు.

రేగడగూడూరు గ్రామంలో..

వెలుగోడు: మండల పరిధిలోని రేగడగూడూరు గ్రామంలో శుక్రవారం జగనన్న విద్యా కానుక కిట్లను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దేశం తిరుపంరెడ్డి, నాయకులు నందిరెడ్డి రామిరెడ్డి, హెచ్ఎం షఫీవుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహానందం.. పల్లకీ ఉత్సవం



భక్తుల మధ్య పల్లకి ఉత్సవ దృశ్యం

మహానంది: మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి పల్లకీలో కొలువై ఆలయప్రాకారాల్లో విహరించారు. మాసశివరాత్రి, శుక్రవారం పురస్కరించుకుని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు.. గంగాకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు.

ఉన్నతశిఖరాలకు చేరుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి

జూపాడుబంగ్లా: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, సర్పంచ్ కృపమ్మ తెలిపారు. జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బండి రేణుక, శ్రీవాణి, ఎస్.రేణుకలకు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం గిరిధర్‌రెడ్డి, పీఎంసీ చైర్మన్ వెంకటరమణ పాల్గొన్నారు.

పేద విద్యార్థులను చేర్చుకోండి

ఆత్మకూరు: ఆత్మకూరు, నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని వసతి గృహాల్లో పేద విద్యార్థులను చేర్చుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి చింతామణి సూచించారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ కార్యాలయంలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల సంక్షేమ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ,అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధి కూలీకి పాముకాటు

మహానంది: ఉపాధి పనులు చేస్తున్న కూలీ ఉసేన్‌సా పాముకాటుకు గురైన సంఘటన బండిఆత్మకూరు మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఉసేన్‌సా తోటి కూలీలతో కలిసి కెనాల్ వద్ద పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. అతడిపి చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాల ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఉసేన్‌సా ఆరోగ్యం మెరుగ్గా ఉందని ఏపీఓ వసుధారెడ్డి తెలిపారు.

ఎర్రమట్టి రవాణా నిలిపివేత

మహానంది: గోపవరం సమీపంలోని బైరవాణి చెరువు నుంచి తరలిస్తున్న ఎర్రమట్టి రవాణాపై సోషల్ మీడియాలో కథనాలు రావడంతో శుక్రవారం అధికారులు స్పందించారు. రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు దాడులు నిర్వహించి మట్టి రవాణాకు బ్రేక్ వేశారు. కాగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గోపవరం సమీపంలోని పొలాల్లో గుంతలు ఏర్పడ్డాయని, గతంలో ఒక విద్యార్థి గుంతలో పడి మృతి చెందాడని చెప్పారు. వాటిని పూడ్చేందుకు, రైతుల పంట పొలాలకు మాత్రమే మట్టిని తీసుకెళ్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కొత్తపల్లి: భారతీయ రిజర్వ్ బాంక్, కెనరా బ్యాంక్ ఆర్థిక సహకారంతో సొసైటీ ఫర్ సోషియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కర్నూలు వారి ఆధ్వర్యంలో గువ్వలకుంట్లలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆర్థిక ప్రవర్తన, ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్, పొదుపు, డిజిటల్ ఫైనాన్స్ సేవలు, ఇన్సూరెన్స్ పథకాలు తదితర పాటిపై ఎస్ఎస్‌టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు కె.రాజు టి.శివ నాగరాజు అవగాహన కల్పించారు.

బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు: వడ్లరామాపురం, సున్నిపెంట పంచాయతీ కార్యదర్శి బాలునాయక్ ఆత్మకూరు ఈఓఆర్‌డీగా శుక్రవారం అదనపు బాధ్యతలు చేపట్టారు.

గిరిజనుల భూములను రక్షించాలి

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలోని పలు చెంచు గూడేల్లో అన్యాక్రాంతమైన భూములను ఐటీడీఏ అధికారులు సంరక్షించాలని గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు జవహర్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం రుద్రకోడూరు చెంచుగూడెంను సందర్శించి ఆయన మాట్లాడారు.

ఆకట్టుకున్న ప్రవచన కార్యక్రమం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై రాజమహేంద్రవరానికి చెందిన తాతా సందీప్ శర్మ.. కిరాతార్జునీయంపై నిర్వహించిన ప్రవచన కార్యక్రమం ఆకట్టుకుంది.

విరాటపర్వ పారాయణ

శ్రీశైలంటెంపుల్: సకాలంలో వర్షాలు కురిసి, పంట లు పండి, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో మహాభారతంలోని విరాటపర్వం పారాయణ ను శ్రీశైల దేవస్థానం జరిపిస్తోంది. శుక్రవారం భ్రమరాంబాదేవి ఆలయ ప్రాంగణం, వృద్ధమల్లికార్జున స్వామి ఆలయ మండపంలో పారాయణ జరిపించారు.

నేడు 'జగనన్న ఆణిముత్యాలు'

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో శనివారం ఉదయం 10 గంటలకు జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓ మౌలాలి శుక్రవారం తెలిపారు. మండలంలోని 12 పాఠశాలల నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కింద వరుసగా రూ. 3000, రూ. 2000, రూ. 1,000 చొప్పున 35 మంది విద్యార్థులకు రూ.71 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

అన్నదానానికి విరాళం

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మహానందిలో భజంత్రీగా విధులు నిర్వహిస్తున్న శివప్ప దంపతులు శుక్రవారం రూ.51,116 విరాళంగా అందించారు. నగదును వారు వేదపండితులు రవిశంకర అవధాని, సిబ్బందికి అందించారు. దాతలకు కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామివారి ప్రసాదాలు, బాండును అందించి సత్కరించారు.

ఎస్ఐపై సమగ్ర విచారణ చేపట్టండి



మాట్లాడుతున్న చెరుకుచెర్ల రఘురామయ్య

మిడుతూరు: అన్యాయానికి కొమ్ముకాస్తున్న ఎస్ఐపై పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి సమగ్రవిచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య హెచ్చరించారు. శుక్రవారం మండ పరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలోని ఆయన స్వగృహంలో ఎస్ఐ తీరుతో ఇబ్బందులకు గురైన పలువురు బాధితులతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐ మారుతీశంకర్ తీరుతో ఇబ్బందులకు గురవుతున్న బాధితుల పక్షాన మీడియా సమక్షంలో ఆయన అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. మండలంలోని పొలం తగాదాలు, ఇంటి మధ్యలో పారుగోడ గొడవలు, రెవెన్యూ, కావలి సమస్యలతో పాటు వీపనగండ్ల గ్రామంలో ఓ సామాజిక వర్గానికి రస్తా విషయంలో జరిగిన గొడవలపైనా బాధితులు స్టేషన్లకు వెళ్లగా సామరస్యంగా పరిష్కరించకుండా దళారులతో ఇరు వర్గాల నుంచి డబ్బు వసూలే ధ్యేయంగా ఎస్ఐ పనిచేస్తున్నారని ఆరోపించారు. ఎస్పీ ఆదేశాలను కూడా బేఖాతర్ చేస్తున్నాడని విమర్శించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు మాణిక్యరాజు మాట్లాడుతూ చెరుకుచెర్ల గ్రామానికి చెందిన తాటిపాటి రవికి రమణకు మధ్య కుళాయి వద్ద జరిగిన గొడవలో రవిని స్టేషన్‌లో విచాక్షణ రహితంగా కొట్టడంతో అతడు పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు.

జగనన్న ఆశీస్సులతోనే పట్టణాభివృద్ధి

- చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతోనే పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బైరెడ్డి నగర్‌లోని 3, 24 వార్డుల్లో కౌన్సిలరు మంగళి కృష్ణ, చాంద్‌బాషా ఆధ్వర్యంలో సీసీ రోడ్లకు చైర్మన్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కాలనీల అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్ర శాప్ చైర్మన్, రాష్ట్ర యువత విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లి పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు రూ.16 కోట్లు మంజూరు చేయించారన్నారు. ఆ నిధులతోనే అన్ని వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు హమీద్, లాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణ, శేఖర్, శాలిబాషా, కుర్వ శ్రీను, స్వాములు, శంకర్, షారుక్, లడ్డూ, పెద్ద శాలి మియ్యా, బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రోత్సహించండి



మాట్లాడుతున్న ఏపీడీ అన్వర్‌బేగం

పగిడ్యాల: పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఆత్మకూరు క్లస్టర్ డ్వామా ఏపీడీ అన్వర్‌బేగం సూచించారు. శుక్రవారం నెహ్రూనగర్ గ్రామ సచివాలయం -1లో వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 16 రకాల పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. చీనీ, నిమ్మ, జామ,సపోట, మామిడి, డ్రాగన్ ఫ్రూట్స్, దానిమ్మ, నేరేడు, బత్తాయి తదితర పండ్ల తోటల సాగుకు వంద శాతం సబ్సిడీ ఇస్తోందన్నారు. ఈ విషయాన్ని బావులు, బోర్లు, చెరువులు ఉన్న రైతులకు వివరించి పండ్ల తోటలు సాగు చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీఓ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్ పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతుల పంపిణీ

పాములపాడు: స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం హెచ్ఎం వెంకటసుబ్బమ్మ ప్రోత్సాహ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10 వ తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో మార్కులు సాధించిన విద్యార్థులు లింగాల లావణ్య, షాహిద్‌బాషా, తాటికొండ కళ్యాణికి వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 చొప్పున నగదు బహుమతులు అందజేశామన్నారు.

మహిళా సమ్మాన్ సేవింగ్స్‌లో అధిక వడ్డీ

మహానంది: మహిళల కోసం ఏర్పాటు చేసిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం ద్వారా అధిక వడ్డీ వస్తుందని పోస్టల్‌శాఖ నంద్యాల డివిజన్ ఏఎస్పీ సత్యనారాయణ తెలిపారు. బండిఆత్మకూరులో శుక్రవారం పోస్టల్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. రెండేళ్ల కాలపరిమితికి 7.5 శాతం వడ్డీరేటు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీఎం శ్రీనివాస నాయక్, ఎంటలు నరసింహ, గణేష్ పాల్గొన్నారు.

శాశ్వత హక్కు పత్రాలు మంజూరు



ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా ప్రతి ఇంటిదారునికి శాశ్వత ఆస్తి హక్కు పత్రాలు అందజేయనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ నాగన్న తెలిపారు. పి.లింగాపురంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో డీటీ నాగన్న, ఆర్ఐ శ్రీరంగారెడ్డి తదితరులు ప్రజల నుంచి ఇళ్ల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగార్జునరెడ్డి, వీఆర్వో చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.